సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



న్యూస్‌రీల్

సమస్యలపై సభ్యుల నిలదీత



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి, వేదికపై కమిషనర్ అన్వేశ్

వేములవాడ: మున్సిపల్ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం సభ్యులు అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం జరిగింది. ఎజెండాలో పొందుపరిచిన అంశాలపై సభ్యులతో చర్చించి ఆమోదించారు. చైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు రూ.19.80లక్షలు వెచ్చించి మూలవాగులో భారీ ఏర్పాట్లు చేసేందుకు చర్చించారు. విలీన గ్రామాల్లో శ్మశానవాటిక నిర్మాణాలకు నిధుల కేటాయింపు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కేటాయిస్తామన్నారు. కమిషనర్ అన్వేశ్, ఏఈలు నర్సింహస్వామి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: పట్టణ స్మైల్ ఫొటో అండ్ వీడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు సబ్బని ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి లక్కం శేఖర్, సుధాకర్, సురేష్, శ్రీకాంత్, భాస్కర్‌బాబు, మనోహర్, నవీన్, వాసు, మధు, రతన్, కృష్ణ, సుమన్, సందీప్ పాల్గొన్నారు.

స్పౌజ్ టీచర్లు సమీప పాఠశాలను ఎంచుకోవాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీల్లో భాగంగా స్పౌజ్‌పాయింట్లు పొందినవారు సమీప పాఠశాలలను ఎంచుకోవాలని డీఈవో రమేశ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. స్పౌజ్ దరఖాస్తుదారులు పొందుపరిచిన సర్టిఫికెట్లతో ఈనెల 1న తన ఆఫీస్‌లో హాజరుకావాలని సూచించారు. ఇష్టానుసారంగా ఆప్షన్స్ ఇస్తే స్పౌజ్ ప్రాధాన్యత పాయింట్లు తొలగించడంతోపాటు సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలకు వెళ్తామని హెచ్చరించారు.

రైతు అభ్యున్నతే సంఘం లక్ష్యం



మాట్లాడుతున్న చైర్మన్ జీల కిషన్‌యాదవ్

సిరిసిల్లఅర్బన్: రైతుల అభ్యున్నతే పీఏసీఎస్ లక్ష్యమని చైర్మన్ జీల కిషన్‌యాదవ్ పేర్కొన్నారు. పెద్దూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. చైర్మన్ కిషన్‌యాదవ్ మాట్లాడుతూ రైతు అభ్యున్నతే లక్ష్యంగా సహకార సంఘం పనిచేస్తుందన్నారు. వైస్‌చైర్మన్ బెజ్జారపు నారాయణ, డైరెక్టర్లు ఎరవెల్లి వెంకటరమణారావు, తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, భాగయ్య, కిషన్ నాయక్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యం.. అనుకోవద్దు భారం

బిడ్డకు దెబ్బతగిలితే కన్నతల్లి తల్లడిల్లుతుంది. పిల్లలు జీవితంలో ఎక్కడ వెనకబడతారోనని తండ్రి అనుక్షణం తపిస్తాడు. తమ కడుపున పుట్టిన వారికోసం సర్వస్వాన్ని అర్పించిన తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపంగా మారుతోంది. జీవిత చరమాంకంలో కన్నబిడ్డలకు భారమై.. అందరూ ఉన్న అనాథలుగా మిగులుతున్నారు. అనాథలకు ఉపయోగపడాల్సిన ఆశ్రమాలు... అందరూ ఉన్న పండుటాకులకు ఆశ్రయమిస్తున్నాయి. అనాథ వృద్ధుల కోసం స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వం కూడా వృద్ధుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు, చట్టాలు అమలు చేస్తోంది. నేడు 'వృద్ధుల దినోత్సవం' సందర్భంగా..

– సాక్షి, కరీంనగర్ డెస్క్

8లో▸

గడువు ముగిసింది.. లక్ష్యం దాటింది

- ఆఖరి రోజు ముంచెత్తిన బతుకమ్మ చీరల బట్ట
- ఐదు గంటలకు గోదాం గేటుకు తాళం వేసిన అధికారులు
- రోడ్డుపై నిలిచిన బట్టల గట్టాల ఆటోలు
- వస్త్రోత్పత్తిదారుల ఆందోళన
- రాత్రి 9 గంటల వరకు సేకరణ



ఇందిరానగర్ గోదాం ముందు రోడ్డుపై బతుకమ్మ చీరల గట్టాలతో ఆటోలు

సిరిసిల్ల: బతుకమ్మ చీరల బట్ట ఉత్పత్తి లక్ష్యం దాటింది. బట్ట సేకరణ సైతం శనివారంతో ముగిసింది. ప్రభుత్వం బతుకమ్మ పండుగ కానుకగా రాష్ట్రంలోని మహిళలకు అందించే చీరల తయారీని సిరిసిల్ల నేతన్నలకు ఇచ్చిన విషయం తెలిసిందే. చీరల బట్ట సేకరణకు శనివారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగియనుందని అధికారులు ప్రకటించడంతో ఆఖరి రోజు చీరల బట్ట గోదాంలను ముంచెత్తింది. పెద్ద మొత్తంలో బట్ట రావడంతో రాత్రి 9 గంటల వరకు అధికారులు తీసుకున్నారు.

చివరి క్షణంలో ముంచెత్తిన బట్ట



సిరిసిల్ల గోదాము వద్ద వస్త్రోత్పత్తిదారులు



గోదాంకు తాళం వేసిన అధికారులు

బతుకమ్మ చీరల సేకరణకు గతంలో రెండుసార్లు గడువు పొడగించిన ప్రభుత్వం వస్త్రోత్పత్తిదారుల విన్నపంతో శనివారం వరకు చివరి గడువు విధించింది. లక్షల మీటర్లలో బట్ట రావడంతో వస్త్రం నాణ్యత పరీక్షలకు ఇబ్బంది ఏర్పడింది. శనివారం సాయంత్రం 5 గంటలకే జౌళిశాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ గోదాం ముందున్న గేటుకు తాళం వేశారు. దీంతో బట్టతో వచ్చిన ఆటోలు గేటు ముందు రోడ్డుపై నిలిచిపోయాయి. ఆ బట్టకు సంబంధించిన వస్త్రోత్పత్తిదారులు గోదాముకు వచ్చి ఆందోళన చేయడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. బట్ట సేకరణకు చివరి రోజు కావడంతో రాత్రి 9 గంటల వరకు బతుకమ్మ చీరల బట్టను సేకరించాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి అనుమతి లభించింది. దీంతో గేటు తాళం తీశారు. ఆటోలు బట్టల గట్టాలతో గోదాముకు చేరాయి.

లక్ష్యం దాటిన సేకరణ

సిరిసిల్లలో వస్త్రోత్పత్తి లక్ష్యం 5.60 కోట్ల మీటర్లు కాగా.. శనివారం రాత్రి 7 గంటల వరకు 5.87 కోట్ల మీటర్ల వస్త్రాన్ని సేకరించారు. సిరిసిల్ల పట్టణంతోపాటు కరీంనగర్ జిల్లా గర్షకుర్తి ఇతర ప్రాంతాల నుంచి బతుకమ్మ చీరల బట్ట రావడంతో లక్ష్యం దాటింది. మొత్తంగా శనివారం రాత్రితో సిరిసిల్లలో బతుకమ్మ చీరల బట్ట సేకరణ పూర్తి అవుతుందని జౌళిశాఖ ఏడీ సాగర్ తెలిపారు.

పక్షపాత రహితంగా ఉండాలి

- నోటిఫికేషన్ రాగానే కోడ్ అమలులోకి వస్తుంది
- ఈ నెల 4న తుది ఓటర్ల జాబితా
- కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికల కోడ్ జిల్లాలో అమలులోకి వస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి శనివారం జిల్లా అధికారులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సమీక్షించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందని సంకేతాలు అందుతున్న తరుణంలో సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు పక్షపాత రహితంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించడం, అమలు చేయడం ఉద్యోగుల బాధ్యత అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన ఉండాలన్నారు. షెడ్యూల్ విడుదల కాగానే క్షేత్రస్థాయి బృందాలు తమ పని ప్రారంభించాలని, ఇందుకు సంబంధించిన మెటీయల్ అందిస్తామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. షెడ్యూల్ వచ్చిన 24 గంటల్లోనే ప్రభుత్వ స్థలాలు, ఆఫీసులు, భవనాలపై ఉన్న పార్టీల గుర్తులు, పోస్టర్లు, బ్యానర్లు, వాల్‌రైటింగ్‌లు తొలగించాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి పాల్గొన్నారు.

4న తుది ఓటర్ల జాబితా

జిల్లాలో ఈ నెల 4న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెల్లడిస్తుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో శనివారం సమావేశమయ్యారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైందన్నారు. కొత్త ఓటు నమోదు, మార్పులు, చేర్పులు, షిఫ్టింగ్ కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు గజభీంకార్ రాజన్న, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాశ్, కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

- నేరచరిత్ర ఉన్న వారిని బైండోవర్ చేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా పెట్టాలని, ముందస్తు ప్రణాళికతోనే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పోలీస్ అధికారులకు, సిబ్బందికి చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. సోషల్‌మీడియాపై దృష్టి పెట్టాలని, తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. మొదటిసారి ఎన్నికల డ్యూటీ చేస్తున్న వారు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని అంశాలపై, ఎన్నికల బందోబస్తు, ప్రవర్తన నియమావళి, సిబ్బంది మోహరింపు, కేంద్ర బలగాలతో సమన్వయమవుతూ ముందుకెళ్లాలని సూచించారు. నేరచరిత్ర ఉన్నవారిని, రౌడీషీటర్లను, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలని సూచించారు. నేరచరిత్ర ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు ఉపేందర్, సదన్‌కుమార్, కరుణాకర్, కృష్ణకుమార్, రవీందర్, అనిల్‌కుమార్, ఆర్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలపై వివక్ష చూపొద్దు

- బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్
- మున్సిపల్ సమావేశంలో నిరసన
- పదమూడు అంశాలు ఆమోదం



కౌన్సిల్‌హాల్‌లో నాగరాజు నిరసన

సిరిసిల్లటౌన్: మున్సిపల్ విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై నిర్లక్ష్యం వీడాలని పదోవార్డుకు చెందిన బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్, పాలకవర్గం తీరు సరికాదంటూ శనివారం మున్సిపల్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అప్పుడే ఆఫీస్‌కు వచ్చిన చైర్‌పర్సన్ జిందం కళ ఇది సరికాదని, ఏదైనా ఉంటే చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించిన సాధారణ సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ తమ పదోవార్డులో కమ్యూనిటీహాల్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదన్నారు. ఒక్కో వార్డులో రెండేసి కమ్యూనిటీహాల్స్, రెండంతస్తుల్లో నిర్మిస్తుంటే తమ వార్డుకు పైసా విదిల్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో అన్నివార్డుల అభివృద్ధికి నిధులు అందిస్తున్నారని అనవసరపు రాద్ధాంతం చేయొద్దని సూచించారు.

గృహలక్ష్మి పథకం ప్లాట్స్‌కు రూ.12లక్షలు

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్లో జిందం కళ మాట్లాడుతూ ఎజెండాలో పొందుపరిచిన 13 అంశాలను కౌన్సిల్ ఆమోదించినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాని అర్హులకు గృహలక్ష్మి కింద నివేశన స్థలాలు ఇచ్చేందుకు మండేపల్లిలోని సర్వేనంబరు 377, 365లోని 27 ఎకరాలలో ప్లాట్స్ అభివృద్ధికి రూ.12లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు. కమిషనర్ ఎండీ ఆయాజ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయం వద్దు

మంత్రి కేటీఆర్ సిరిసిల్ల సమగ్రాభివృద్ధికి నిధులు అందిస్తుంటే బీజేపీ కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపడం సరికాదని విలీన గ్రామాల పరిధిలోని పలు వార్డుల కౌన్సిలర్లు హితవు పలికారు. చైర్‌పర్సన్ చాంబర్‌లో జరిగిన ప్రెస్‌మీట్లో వారు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ విలీన గ్రామాల అభివృద్ధికి ఇటీవల కోట్లాది రూపాయలు అందించారన్నారు. పదోవార్డులోనూ రూ.కోటి వరకు నిధులు అందించారని గుర్తు చేశారు. విలీన గ్రామాల కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, కల్లూరి లత, పోచవేని సత్య, రెడ్యానాయక్, రాజిరెడ్డి, బుర్ర లక్ష్మి పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం.. పార్టీ అభ్యర్థిని గెలిపిద్దాం

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

వేములవాడ: నాయకులు, కార్యకర్తలం కలిసికట్టుగా పనిచేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు నివాసంలో శనివారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో ముందుకెళ్తే గెలుపు మనదే ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. ప్రతిపక్షాలకు ఇక్కడ చోటులేదని స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థి చలిమెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణకు వేములవాడ పెట్టింది పేరన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు సూచనలు, సలహాలతో నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాధవి, పార్టీ మండలాల అధ్యక్షులు సత్తిరెడ్డి, గడీల ప్రసాద్, కమలాకర్, ఎల్లయ్య, రవి, దేవయ్య, పుల్కం రాజు, ఎంపీపీలు రేవతి, స్వరూప, లావణ్య చంద్రయ్యగౌడ్, వజ్రవ్వ, జెడ్పీటీసీలు భూమయ్య, మ్యాకల రవి పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంకు సమావేశం రసాభాస

- చైర్మన్ మినహా డైరెక్టర్లందరూ గైర్హాజరు
- బ్యాంకులో అక్రమాలపై విచారణకు డిమాండ్



చైర్మన్ నారాయణతో సభ్యుల వాగ్వాదం

సిరిసిల్లటౌన్: గతంలో ఎన్నడూ లేని విధంగా సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు వార్షిక మహాసభ వాయిదా పడింది. డైరెక్టర్లు ఎవరూ మహాసభకు హాజరుకాలేదు. బ్యాంకు లావాదేవీల్లో అక్రమాలు జరిగాయని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలపై నిగ్గు తేల్చాలని పట్టుబట్టడం.. చైర్మన్, సీఈవోల తీరుపై సభ్యులు నిరసన తెలిపారు.

సభ్యుల నిరసనలు

బ్యాంకు సమావేశం మొదలు నుంచి డైరెక్టర్లు ఒక్కరూ కూడా హాజరుకాకపోవడంపై కారణాలు చెప్పాలంటూ సభ్యులు రాగుల రాములు, గోనె ఎల్లప్ప, బియ్యంకార్ శ్రీనివాస్, సోమిశెట్టి దశరథం తదితరులు చైర్మన్ నారాయణను ప్రశ్నించారు. తనకు తెలియదని చైర్మన్ బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశబూరు. బ్యాంక్ పాలకవర్గాన్ని రద్దు చేయాలని కోరుతూ వేదిక ముందు బైఠాయించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సీఈవో సమాధానాలు చెప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార బ్యాంకులో అధికార పార్టీ పెద్దలు జోక్యం సరికాదన్నారు. బ్యాంకు సీనియర్ సభ్యుడు సామల మల్లేశం, పూర్వచైర్మన్ గాజుల బాలయ్య తదితరులు సభను తాత్కాలిక వాయిదా వేయాలని కోరగా..చైర్మన్ గాజుల నారాయణ సభను వాయిదా వేశారు.

డైరెక్టర్లు అందరూ గైర్హాజరు

కొద్ది రోజులుగా బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణపై వైస్‌చైర్మన్ గడ్డం విఠల్‌తోపాటు మిగిలిన డైరెక్టర్లు అసంతృప్తితో ఉంటున్నారు. రెండుసార్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా అధికార పార్టీ పెద్దల ప్రమేయంతో వీగిపోయేలా చేశారు. కాగా వార్షిక సభకు డైరెక్టర్లు రాకపోవడం చర్చనీయాంశమైంది.

పట్టణ పేదలకు 850 పట్టాలు

- మండెపల్లి శివారులో ఇళ్ల స్థలాలు
- 'గృహలక్ష్మి' కింద రూ.3లక్షల చొప్పున మంజూరు
- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో పట్టాల పంపిణీకి ఏర్పాట్లు



ఆర్డీవోతో సమావేశమైన టీపీవో అన్సారీ, బీఆర్‌ఎస్ నాయకుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి రంగం సిద్ధమైంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని లక్కీ డ్రాలో పేరు రాని పేదలకు స్థలాన్ని కేటాయించాలని భావిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు ఆదేశాలతో ఈమేరకు అడుగులు పడుతున్నాయి. సిరిసిల్ల ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్, మున్సిపల్ టీపీవో అన్సార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆర్డీవో ఆఫీస్‌లో శనివారం సమావేశమయ్యారు. పట్టణంలోని అన్ని వార్డులకు సంబంధించిన అర్హులు 850 మందికి ఇంటి స్థలం పట్టాలను మండెపల్లి శివారులో ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ సమీపంలోనే వంద ఫీట్ల రోడ్డు ముందు ప్రభుత్వ స్థలంలో పట్టాలు ఇచ్చేందుకు లేఅవుట్ సిద్ధం చేశారు.

తొలుత 400 మందికి గృహలక్ష్మి నిధులు

పట్టణంలోని 850 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడంతోపాటు తొలి విడతగా 400 మందికి గృహలక్ష్మిలో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల చొప్పున మంజూరు చేయనున్నారు. 850 మంది పట్టాదారుల్లో 400 మందిని డ్రా విధానంలో ఎంపిక చేసి రూ.3 లక్షల చొప్పున కేటాయిస్తారు. రెండో విడతలో మిగతా 450 మందికి వర్తింపజేస్తారు. పట్టణంలోని పేదలకు ఇప్పటికే 1890 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేశారు. మరో 164 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అన్ని అర్హతలుండి డ్రాలో పేరు రాని వారందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

రానున్న ఎన్నికల్లో బీజేపీదే విజయం



ముస్తాబాద్(సిరిసిల్ల):రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉంటే అభివృద్ధి డబుల్ వేగంతో జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. అంతకుముందు పితృవియోగం చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు. సెస్ మాజీ డైరెక్టర్ కొక్కు దేవేందర్, మల్లారపు సంతోష్‌రెడ్డి, చిట్నేని శ్రీనివాస్‌రావు, మట్ట రాజేశ్వర్‌రావు ఉన్నారు.

హత్యాయత్నం చేసిన నిందితుల రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొలనూర్‌లో పాతకక్షల నేపథ్యంలో మేర్గు ప్రసాద్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డ మేర్గు బుచ్చిరాజం, మేర్గు అశోక్, మేర్గు తిరుపతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఎస్సై అంజనేయులు తెలిపిన వివరాలు. సెప్టెంబర్ 27న రాత్రి మేర్గు ప్రసాద్‌పై ముగ్గురు గొడ్డలితో దాడి చేశారు. రక్తపు మడుగులో పడిపోయిన ప్రసాద్‌ను చనిపోయాడనుకుని వెళ్లిపోయారు. తీవ్రగాయాలతో ప్రసాద్ కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసును విచారించి నిందితులను రిమాండ్‌కు పంపారు.

దినసరి కూలీ బతుకు విషాదాంతం



మహేందర్ కుటుంబీకులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ఓ దినసరి కూలీ బతుకు విషాదాంతంగా ముగిసింది. ఇంటిని అమ్ముకొని చికిత్స చేయించుకున్నా.. ఖరీదైన వైద్యం అందని పరిస్థితుల్లో కుటుంబ పెద్ద మృతిచెందగా.. ఆ కుటుంబ రోడ్డున పడింది. సిరిసిల్ల పరిధిలోని చిన్నబో నాలకు చెందిన బానోతు మహేందర్(29) దినసరి కూలీ. భార్య లావణ్య భర్తతోపాటు కూలీ పనికి వెళ్తూ ఇద్దరు పిల్లలు, తల్లి బుచ్చవ్వలను సాదుకుంటున్నారు. పూరిగుడిసెలో ఉంటున్నారు. మహేందర్ కిడ్నీ వ్యాధితో మంచంపట్టాడు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఉన్న ఇంటిని అమ్మేశారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేకపోయాడు. ఆరోగ్య పరిస్థితిని చూసి అద్దె ఇంట్లో ఉంచుకోవడానికి నిరాకరించడంతో సుందరయ్యనగర్ కమ్యూనిటీహాల్‌లో తలదాచుకోగా గురువారం మృతిచెందాడు. కొడుకు దేవదాస్(5), కూతురు అక్షర(3) ఉన్నారు. తండ్రికి కొడుకుతో కొరివి పెట్టిస్తే సొంతిల్లు లేక, శ్మశానవాటికలో చిన్నపిల్లలు ఉండరని భావించి తల్లి బుచ్చవ్వనే కొడుకుకు తలకొరివి పెట్టి..బంధువుల ఇంట్లో తలదాచుకోగా.. లావణ్య, పిల్లలిద్దరు పుట్టింట్లో ఉంటున్నారు. కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్ వైకుంఠరథం, ఇతర ఖర్చులు భరించడంతో అంత్యక్రియలు పూర్తిచేశారు. విద్యానగర్‌లో శనివారం మూడో రోజు కార్యక్రమం నిర్వహించేందుకు రాగా.. వారి పరిస్థితి చూసి పలువురిని కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబానికి డబుల్‌బెడ్ రూమ్ మంజూరైనా..ప్లాట్ కేటాయించకపోవడంతో ఇలా కర్మకాండలు చేయించలేని స్థితిలో ఆ కుటుంబం తలోదిక్కుగా విడిపోయారు.

వృద్ధాప్యం.. అనుకోవద్దు భారం

• మలిసంధ్యలో కన్నవారిని కాపాడుకోవాలి • నిర్లక్ష్యం చేసిన వారికి తప్పదు శిక్ష • పండుటాకుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు

కనిపించిన తల్లిదండ్రులే వృద్ధాప్యంలో పిల్లలకు భారమవుతున్నారు. తమ బుజాలపై మోసిన పిల్లలే పెద్దాయ్యాక తల్లిదండ్రులను దూరంగా పెడుతున్నారు. రెక్కలొచ్చిన పక్షుల్లా కన్నవాళ్లను వదిలేసుకుంటున్నారు. అందరూ ఉన్నా అనాథలా మారుతున్న వృద్ధుల్లో చాలా మంది భిక్షాటన చేస్తూ కాలం వెల్లదీస్తుండగా.. మరికొందరు పాడుబడిన భవనాలు, బస్టాపులు, చెట్లకింద, ఆలయాల దగ్గర తలదాచుకుంటున్నారు. ఇలాంటి వారిని వృద్ధాశ్రమాలు చేరదీస్తున్నాయి. ఆకలి తీరుస్తూ.. ఆశ్రయమిస్తున్నాయి. చనిపోతే ఆశ్రమ నిర్వాహకులే కర్మకాండలు పూర్తిచేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. – సాక్షి, కరీంనగర్ డెస్క్



నేడు వృద్ధుల దినోత్సవం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలి కేసు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్లలో 2013లో తొలి కేసు నమోదైంది. చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన మొహినవ్వ తనను కొడుకు మల్లేశం పట్టించుకోవడం లేదని ఊరిలో పంచాయితీ పెట్టింది. కోపోద్రిక్తుడైన కొడుకు తల్లిపై దాడి చేసి కాలు విరగొట్టాడు. ఈ సంఘటనపై కరీంనగర్ జిల్లా అప్పటి కలెక్టర్ వీరబ్రహ్మయ్య స్పందించి కేసు నమోదు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. ఇలా మల్లేశంపై ఉమ్మడి జిల్లాలో తొలి కేసు నమోదైంది. అప్పటి సిరిసిల్ల ఆర్డీవో కే.శ్రీనివాస్ తల్లి పోషణకు ప్రతి నెల రూ.1500 ఇవ్వాలని తీర్పునిచ్చారు. తీర్పును ఉల్లంఘిస్తే జైలుశిక్ష అమలయ్యేలా ఆదేశాలు జారీ చేశారు.

భూమి విక్రయానికి తీర్పు

చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన పెరుక నర్సయ్యను ఆయన కొడుకు రాజయ్య పోషించడం లేదని అడిగినందుకు కొడుకు దాడి చేశాడు. ఈ సంఘటనపై చందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సిరిసిల్ల ఆర్డీవో భిక్షానాయక్ విచారణ చేపట్టి.. నర్సయ్య సంపాదించిన 20 గుంటల భూమి మార్కెట్ ధర ప్రకారం విక్రయించి, ఆ డబ్బులను నర్సయ్య, స్థానిక వీఆర్వో పేరిట బ్యాంక్‌లో జాయింట్ ఖాతా తెరిచి డిపాజిట్ చేసేలా తీర్పునిచ్చారు. ఆ డబ్బుపై వచ్చిన వడ్డీని నర్సయ్యకు వీఆర్వో ప్రతి నెల ఇవ్వాలని ఆదేశించారు.



ఉమ్మడి జిల్లాలో ఆశ్రమాలు.. ఫోన్ నంబర్లు

ఆశ్రమం పేరు	వృద్ధుల సంఖ్య	ఫోన్‌నంబరు
కరీంనగర్‌లో		
వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమం	45	9949914242
వాసవి వృద్ధాశ్రమం	35	7893185545
భవిత వృద్ధాశ్రమం	10	8790395423
స్పందన వృద్ధాశ్రమం	20	9440421366
సాయికృష్ణ ఆశ్రమం	08	8523842420
సిరిసిల్ల		
మండేపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమం	18	8790822748
లగిశెట్టి విశ్వనాథం వృద్ధాశ్రమం, తంగళ్లపల్లి	21	9440072172
అమ్మ అనాథ వృద్ధాశ్రమం, ఓబులపూర్	4	9866566926
డే కేర్ కేంద్రం, ఎల్లారెడ్డిపేట	8	8790822748
మా ఆశ్రమం గంభీరావుపేట	20	9849830698
జగిత్యాల జిల్లా		
శివగాయత్రి ఆశ్రమం	30	95736 10777
శ్రీ గాయత్రి విశ్వకర్మ వృద్ధుల ఆశ్రమం	30	9440070616
పెద్దపల్లి జిల్లా		
శ్రీధర్మశాస్త్ర వృద్ధాశ్రమం		9346503711

మలిసంధ్యలో వెలుగురేఖ

అందరి మధ్య ఒంటరి గువ్వలవుతున్న ఎందరో వృద్ధులకు సిరిసిల్ల పట్టణ శివారులోని చీటి భూంరావు వృద్ధాశ్రమం అండగా నిలుస్తోంది. వారి కుటుంబ సభ్యుల నుంచి చిల్లిగవ్వ ఆశించకుండా.. మలిసంధ్యలో దిక్కులు చూసే వారిని అక్కున చేర్చుకుని ఆత్మీయతను పంచుతోంది. సిరిసిల్ల శివారులోని రగుడు వద్ద రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్‌లోనే చీటి భూంరావు వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు వారి మామ చీటి భూంరావు పేరుతో వృద్ధాశ్రమాన్ని 2011లో ప్రారంభించారు. ప్రస్తుతం 17 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.

సకల వసతులు..

వృద్ధాశ్రమంలో 18 గదులున్నాయి. మహిళలకు, వృద్ధులకు వేరు వేరుగా వసతులు కల్పించారు. భార్యాభర్తలుంటే వారికి ఒక్కచోటే రూంలు కేటాయించారు. నిత్యం పిల్లలతో పాటు రెండు పూటలా భోజనం చేస్తూ.. ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తారు. చేతనైన వారు ఏదైనా వంటకు సాయం చేస్తూ.. ఉంటారు. ఏడేళ్లుగా చీటి భూంరావు ఆశ్రయంలో చాలా మంది ఆశ్రయం పొందారు. ఆశ్రమంలో ఉన్న వారి నుంచి చిల్లిగవ్వ ఆశించడం లేదు.

వృద్ధులకు అండగా శ్రీధర్మశాస్త్ర

గోదావరిఖనిలో అనాథలు, నిరుపేదలకు శ్రీధర్మశాస్త్ర నిత్యన్నదాన వేదిక అండగా నిలుస్తోంది. వందలాది మంది ఆకలి తీరుస్తోంది. కొటం బాబు 2007లో శ్రీధర్మశాస్త్ర నిత్యాన్నదాన వేదికను స్థాపించారు. సింగరేణి సంస్థ సహకారంతో గోదావరిఖని తిలక్‌నగర్‌లో 2012లో శ్రీధర్మశాస్త్ర వృద్ధుల సేవా ఆశ్రమాన్ని 30 మంది అనాథ వృద్ధులతో ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 16 మంది వృద్ధులు సేద తీరుతున్నారు.

వయోవృద్ధుల పోషణ చట్టం ఏం చెబుతోంది



వయోవృద్ధుల పోషన సంక్షేమ చట్టం–2007 ప్రకారం తల్లిదండ్రులను ఏ రకంగానైన నిర్లక్ష్యం చేస్తే వారికి మూడు నెలల జైలు, రూ.5వేల జరిమానా విధించే అవకాశం ఉంది. సంతానం లేని వారు తమ ఆస్తులు అనుభవిస్తున్న వారి నుంచి పోషణ ఖర్చులు పొందే హక్కులు కలిగి ఉంటారు. తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేస్తే వారు నేరుగా ఆర్డీవోకు కానీ మీసేవ కేంద్రం ద్వారా కాని ఫిర్యాదు చేయవచ్చు. ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీవో వ్యవహరిస్తారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై సంబంధిత ప్రాంత తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ చేపడతారు. ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ చేస్తారు. న్యాయం జరిగిందని బాధితులు భావిస్తే సమస్య పరిష్కారమవుతుంది. లేదంటే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విషయంలో బాధితులే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు ఆర్డీవోకు ఫిర్యాదు చేయవచ్చు.

తల్లిదండ్రులను పోషించాల్సిందే..



తల్లిదండ్రులను పిల్లలు పోషించాల్సిందే. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే 2007 వయోవృద్ధుల సంరక్షణచట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకుంటే నోటీసులు ఇచ్చి విచారిస్తాం. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని బట్టి తల్లిదండ్రులకు భత్యం ఇప్పిస్తాం. ఆ చట్టం చాలా కఠినమైంది. కన్నవాళ్లను వారి పిల్లలు బాధ్యతగా పోషించాల్సిందే. – ఎస్.ఆనంద్‌కుమార్, ఆర్డీవో, సిరిసిల్ల

ఒంటరిగా ఉండలేక ఆశ్రమంలో చేరా..



మాది ఇల్లంతకుంట మండలం రేపాక. నా భర్త ఏడాది క్రితం చనిపోయిండు. పనులు చేసుకునేందుకు శరీరం సహకరించ ఊరిలో ఒంటరిగా ఉండలేక ఆశ్రమంలో చేరాను. – రొండ్ల విజయ, ఇల్లంతకుంట

ఎవరూ లేకపోవడంతో ఇక్కడికి వచ్చా..



చాలా రోజుల కింద తమిళనాడు నుంచి ఉపాధి వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వచ్చాం. భర్త, నేను ప్రైవేట్ స్కూళ్లలో టీచర్లుగా పనిచేశాం. అనారోగ్యంతో సంవత్సరం క్రితం భర్త చనిపోయాడు. నా ఆరోగ్యం సరిగ్గా లేదు. చూసుకునే వారు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమంలో చేరాను. – భారతి, తమిళనాడు

పిల్లలు భారంగా భావించడంతో..



మాది మంత్రాలయం దగ్గర చిన్నపల్లెటూరు. నాకు ఇద్దరు అబ్బాయిలు. ఒకడు వ్యవసాయం చేస్తుంటే.. చిన్న బ్బాయి అమెరికాలో ఉంటున్నాడు. కూతురుకు పెళ్లి అయ్యింది. పిల్లలు భారంగా భావించడంతో దిక్కులేని స్థితిలో ఇక్కడికి వచ్చాను. – సి.శంకరమ్మ, మంత్రాలయం

వృద్ధులకు అండగా ఉండాలని



పిల్లల ఆదరణ దూరమైన వృద్ధులకు మలిసంధ్యలో అండగా ఉండాలని 2011లో మా మామ చీటి భూమారావు పేరిట వృద్ధాశ్రమం పెట్టాం. ప్రస్తుతం 12 మంది ఉన్నారు. ఇటీవల ప్రభుత్వ వృద్ధాశ్రమాలు కూడా ఏర్పాటు కావడంతో అందరూ అటు వైపు వెళ్తున్నారు. ఉన్నవాళ్లకు అన్ని వసతులు కల్పిస్తున్నాం. 12 ఏళ్లుగా వృద్ధాశ్రమాన్ని కొనసాగిస్తున్నాం. – రంగినేని మోహన్‌రావు, ట్రస్ట్ అధ్యక్షుడు

పూర్వజన్మ సుకృతం



నా అనే వారు లేని, ఉన్నా.. పట్టెడన్నం పెట్టే పరిస్థితుల్లో లేని కుటుంబాలకు చెందిన వృద్ధులను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించి భోజన వసతి కల్పించే అవకాశం రావడం నా పూర్వజన్మసుకృతం. నాలో శక్తి ఉన్నంత వరకు అనాథవృద్ధులను చేరదీస్తాను. ఆశ్రయం పొందిన వారు జీవితాన్ని ముగిస్తే వారి అంతిమ సంస్కరం కూడా నేనే నిర్వహిస్తున్నాను. – సీపెల్లి వీరమాధవ్, వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం

పేదల ఆకలి కదిలించింది



నిరుపేదల ఆకలి తీర్చుకునేందుకు పడుతున్న ఇబ్బందులు నన్ను కదిలించాయి. వృద్ధులపై జాలి, దయ లేకుండా వ్యవహరిస్తున్నారు. నేటి సమాజంలో పెద్దలపై పట్టింపు కొరవడుతోంది. చీదరింపులు, అవమానాలు పెరుగుతున్నాయి. అందరూ ఉండి ఆశ్రమలకు రావడం బాధగా ఉంటుంది. – కొటం బాబు, శ్రీధర్మశాస్త్ర వృద్ధాశ్రమం నిర్వాహకుడు, గోదావరిఖని

హత్యకు గల్ఫ్‌లోనే స్కెచ్

• మల్యాల మర్డర్ కేసు నిందితుడి అరెస్టు



కొండూరి మల్లేశంను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై అశోక్

వేములవాడ: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన మల్లేశం తన భార్య పడిగెల నరేశ్‌తో వివాహేతర సంబంధం నెరపుతున్నట్లు అనుమానం వచ్చి ప్రస్తుతమున్న సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి హత్యకు గల్ఫ్‌లోనే స్కెచ్ వేశాడని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో మల్యాలలో సెప్టెంబర్ 13వ తేదీ రాత్రి జరిగిన నరేశ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు కొండూరి మల్లేశంను అరెస్టు చూపించారు. డీఎస్పీ మాట్లాడుతూ గతంలోనే అక్రమ సంబంధంతో గొడవలు జరగగా, ఓసారి హెచ్చరించినప్పటికీ నరేశ్‌లో మార్పు రాలేదు. దీంతో ఎలాగైనా హతమార్చాలను ప్లాన్ వేసుకుని గల్ఫ్ నుంచి చెప్పా పెట్టకుండా వచ్చి, వేములవాడలోని ఓ ప్రైవేట్ లాడ్జీలో తలదాచుకున్నాడు. ఓ బైక్‌ను అద్దెకు తీసుకుని పథకం ప్రకారం 13వ తేదీ రాత్రి మల్యాలకు చేరుకుని నరేశ్‌ను హత్య చేశాడు. వెంటనే దుబాయ్‌కి వెళ్లిపోయాడు. ప్రభుత్వ సహకారంతో దుబాయ్‌లో ఉన్న నరేశ్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని, అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ సంబంధాలతో కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. హత్య కేసును ఛేదించిన చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై అశోక్‌లను డీఎస్పీ అభినందించారు.

సృజనాత్మకతతో కథా రచన

• రంగినేని ట్రస్టులో ముగిసిన కథా రచన వర్క్‌షాప్

సిరిసిల్లకల్చరల్: కథా రచనలో మెళకువల అధ్యయనంతో విద్యార్థుల్లో సృజనాత్మకత వెల్లివిరుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. రగుడులోని రంగినేని ట్రస్టు ఆవరణలో మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం 'పిల్లల పండుగ' వర్క్‌షాప్ నిర్వహించారు. బాలసాహిత్యకారులు డాక్టర్ వీఆర్ శర్మ, చొక్కాపు వెంకటరమణ, శాంతారావు కథా రచనలో మెళకువలు నేర్పించారు. జీవితంలోని అనుభవాలను నాటకీయంగా వర్ణించేందుకు ఉపయోగపడుతుందన్నారు. బడిపిల్లలు రచించిన 'కతల చెట్టు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ట్రస్టు నిర్వాహకుడు రంగినేని మోహన్‌రావు అధ్యక్షత నిర్వహించిన సభలో జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఎస్‌బీటీ రీజినల్ మేనేజర్ డాక్టర్ పత్తిపాక మోహన్, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, రంగినేని నవీన్ కుమార్, గరిపెల్లి అశోక్ మాట్లాడారు. పిల్లల సందేహాలకు ఎలగొండ రవి, ట్రస్టు పాఠశాల ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్, డాక్టర్ వాసరవేని పరశురాంలు సమాధానాలిచ్చారు. డీఈవో రమేశ్‌కుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం తూడి వెంకటరావు, మద్దికుంట లక్ష్మణ్ హాజరయ్యారు.

జోయాలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



వాసవీ గార్డెన్స్‌లో జోయాలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని వాసవీ గార్డెన్స్(కల్యాణ మండపం) ఏసీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జోయాలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో తొలిసారి మూడు రోజులపాటు ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు వరల్డ్ ఫేవరేట్ జ్యువెలరీ సంస్థ జోయాలుక్కాస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. చైర్‌పర్సన్ జ్యోతి వెలిగించి ప్రదర్శనను ప్రారంభించారు. జోయాలుక్కాస్ సంస్థ రీజినల్ మేనేజర్ రాబిన్ తంబి, కౌన్సిలర్ నేరెళ్ల శైలజ, సిరిసిల్ల, వేములవాడ పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, జోయాలుక్కాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. మూడు రోజుల పాటు సిరిసిల్లలో ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

క్రీడలతో క్రమశిక్షణ, ఉత్తమ లక్షణాలు

• కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ గోపి

• అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



కరీంనగర్‌స్పోర్ట్స్: సుదీర్ఘ శిక్షణ, లక్ష్య సాధనతోనే క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం 9వ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలను పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడుతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. ఒకప్పుడు క్రీడల వైపు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు విముఖత చూపేవారని, ప్రస్తుతం సరైన ప్రోత్సాహం అందిస్తూ పిల్లల వెంట వచ్చి ఉత్సాహం నింపుతున్నారని వివరించారు. తన కూతురును కూడా క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టాండ్లీ జోన్స్ మాట్లాడుతూ తెలంగాణ అథ్లెటిక్స్ క్రీడాకారులు దేశంలో ఉన్నతంగా ఎదుగుతున్నారని వివరించారు. జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ మాట్లాడుతూ విజేతలుగా నిలిచే క్రీడాకారులను హన్మకొండలో జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అథ్లెటిక్ ప్రధాన కార్యదర్శి కడారి రవి, సారంగపాణి, జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజవీరు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 5 కిలోమీటర్ల రన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేశారు.

సిరిసిల్ల పీఆర్ ఈఈగా సూర్యప్రకాశ్



సూర్యప్రకాశ్ పీఆర్ ఈఈ

సిరిసిల్ల: జిల్లా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా సూర్యప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సూర్యప్రకాశ్ డీఈఈగా పనిచేస్తూ ఇన్‌చార్జి పీఆర్ ఈఈగా ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో పలువురి డీఈఈలకు పంచాయతీరాజ్‌శాఖలో ఈఈలుగా పదోన్నతి లభించింది. అందులో భాగంగా సూర్యప్రకాశ్‌కు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ జిల్లాకు నియమించారు.

తండ్రి చేతిలో తనయుడి హతం

• వేధింపులు భరించలేక గొడ్డలితో నరికిన తండ్రి

గంభీరావుపేట(సిరిసిల్ల): తాగుడుకు బానిసైన కొడుకు వేధింపులు భరించలేక తండ్రి గొడ్డలితో నరికి చంపిన సంఘటన జిల్లాలో శనివారం జరిగింది. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన కుంట రమేశ్(38) విద్యుత్‌శాఖలో లైన్‌మన్‌గా పనిచేసేవాడు. తాగుడుకు బానిస కావడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఇంటి దగ్గరే ఉంటూ కులవృత్తి చేపలు పడుతున్నాడు. తాగుడుకు బానిసై వృద్ధులైన తల్లిదండ్రులను, దివ్యాంగుడైన సోదరున్ని పింఛన్ డబ్బులు ఇవ్వాలని వేధించేవాడు. అంతేకాకుండా గ్రామంలోనూ పలువురి వద్ద అప్పులు చేశాడు. డబ్బుల కోసం కొడుకు పెడుతున్న వేధింపులు భరించలేక తండ్రి సాయిలు శనివారం ఉదయం ఇంట్లో నిద్రిస్తున్న కొడుకు రమేశ్‌పై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై మహేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. తండ్రి సాయిలు పోలీసుల అదుపులో ఉన్నాడు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు